గుండె ఝల్లుమంది ప్రకాష్‌కు. కాళ్ళలో సన్నగా వణుకు ప్రారంభమయింది. తను అతనివైపు చూసాడు. ఆ సమయంలో అతను తనవైపే సూటిగా చూస్తున్నాడు. వాతావరణం చల్లగా వున్నా నుదుట చిరుచెమట పట్టింది. తను పొరపాటు చేసాడు. అతన్ని చూడగానే తను చూపులు మరల్చుకోవలసింది. అతన్ని, అక్కడ, ఆ సమయంలో చూడగానే దిగ్భ్రాంతితో ఒక అనిమిషం చూస్తూ వుండిపోయాడు. అప్రయత్నంగా తన చెయ్యి పైకి లేవబోయి, తన మనసు వెంటనే మేలుకోవడంతో క్రిందకు జారిపోయింది.

తనేం చేయాలి ఇప్పుడు? వేగంగా అక్కడినుంచి పారిపోవాలా ఆలోచిస్తుండగానే? అతను ప్రకాష్‌వైపు అడుగులు వేస్తున్నాడు. ప్రకాష్‌కు ఊపిరి స్తంభించినంత పనయింది. శరీరంలో వణుకు మరింత పెరిగింది. ఎంతగానో నిభాయించుకున్నాడు.

రేపు ఆఫీసుకు వెళ్ళగానే ఛెడా మడా తిట్టిపోస్తాడు. తను నోరు మెదిపిన, మెదపకపోయినా జరిగేది ఒక్కటే–తనను ఉద్యోగంలోంచి డిస్మిస్ చేయడం ఖాయం.

ఏదో మిరకిల్ జరిగితేకాని, ఈ ఛండశాసనుడి బారినుంచి తను తప్పించుకోలేడు.... ఏం చేయాలి?.... ఎలా తప్పించుకోవాలి.... తక్కున మెదడులో మెరుపు మెరిసింది.

"మిస్టర్ ప్రకాష్' అంటూ భుజంపై చెయ్యి వేసాడు సేల్స్ ఆఫీసర్ బినాయ్.

వెంటనే ముఖం చిట్లిస్తూ బినాయ్‌వైపు చూసాడు ప్రకాష్. "ఎవరు మీరు? మిమ్మల్ని ఎప్పుడూ చూసిన గుర్తులేదే?" అయినా నా పేరు ప్రకాష్‌కాదు. బినాయ్‌కి తెలుగు రాదని తెలిసి కూడా తెలుగులో మాట్లాడాడు.

"వాటార్ యూ సేయింగ్ ప్రకాష్" సూటిగా చూస్తూ అడిగాడు బినాయ్.

"అదే నేనూ అడుగుతున్నాను. మీ రెవరు? ప్రకాష్ ఎవరు?" ఎంతో చిరాగ్గా ముఖం పెట్టాడు.

ఇతను పూర్తిగా తెలుగులో మాట్లాడుతున్నాడు. తన పేరు ప్రకాష్ కాదని చెబుతున్నట్టుగా వుంది. తను పొరపడ్డాడా అహా! ఇతను ప్రకాష్ కాకపోవడమేమిటి!–ఒకవేళ ప్రకాష్ బ్రదరా?– అనుకుంటూ...."ఐ డోంట్ నో తెలుగు. ప్లీజ్ స్పీక్ ఇన్ ఇంగ్లీష్ ఆర్ హిందీ ప్రకాష్."

"ప్రకాష్....ప్రకాష్ .... హూ యీజ్ ప్రకాష్....హూఆర్‌యూ–వాటీజ్ ది హెల్ యు ఆర్ టాకింగ్" దులపరించినట్టు మాట్లాడాడు.


చివరి మాటలు చర్రుమనిపించాయి ప్రకాష్‌కి. "యుఆర్ నాట్ ప్రకాష్' మెల్లగా గొణిగాడు. "అయామ్ సారీ. సమ్ రాంగ్ థాట్ .... యువర్ గుడ్ నేమ్ ప్లీజ్!"

"భూతాలరాజు" అని, విసురుగా అక్కడినుంచి కదిలాడు, ఎంత ధైర్యంగా బుకాయించినా గుండెదడ చాలా ఎక్కువగానే వుంది. బినాయ్ ముఖం ఎలా వుందో వెనక్కి తిరిగి చూడాలని వుంది. కాని, అలా చూస్తే తన బండారం బయట పడిపోతుందేమో ననే భయంతో, తల వెనక్కు తిప్పకుండా ముందుకు సాగిపోయాడు.

తిలక్ రోడ్‌లోకి తిరగ్గానే, కనిపించిన ఆటో ఎక్కాడు. అప్పటికే ఒక నిర్ణయానికి వచ్చాడతను. నాంపల్లి టప్పాసాంద్‌కు వెళ్ళాడు.

* * *

ప్రకాష్ నార్త్–వెస్ట్ మెడికల్ కంపెనీ హైద్రాబాద్ బ్రాంచిలో రిప్రజంటేటివ్, హెడ్డాఫీస్ కం



కత్తాలో వుంది. డ్యూటీ ప్రకారం ప్రకాష్ క్రితంరోజునే మహబూబ్ నగర్‌ఏరియాలో ఉండాలి. కాని అతను టూర్ వెళ్ళలేదు. అప్పుడప్పుడుఅలా ఎగకొట్టడం, టూర్ వెళ్ళినట్టుగా టి.ఏ., డి.ఏ. క్లెయిమ్ చేయడం అతనికి మామూలే. డీలర్స్‌ను తను రొటీన్‌గా కలవకపోయినా, వాళ్ళలో తనకున్న పరిచయాలవల్ల బిజెనెస్ మామూలుగానే వస్తుందనీ అతని నమ్మకం.

కాని, అతను టూర్ వెళ్ళలేదని కంపెనీకి తెలిస్తే ప్రమాదమే. అదీ సేల్స్ ఆఫీసర్‌కి తెలిస్తే కొంప మునిగినట్టే.

సేల్స్ ఆఫీసర్ బినాయ్‌కి విపరీతమైన కోపం. అతని పేరు చెబితే కంపెనీ రిప్రజంటేటివ్‌లు అందరికీ షాక్. అతనితోపాటు లైన్‌లో వెళ్ళాలంటే గుండెలు బిక్కు బిక్కుమంటాయి. అతని ముఖంలో నవ్వు ఏ రిప్రజంటేటివ్ చూసి వుండడు. ప్రకాష్‌తన కొలీగ్స్‌తో చాలాసార్లు అన్నాడు ఈ మహానుభావుడు ఇంటి దగ్గర కూడా ఇలానే ఉంటాడేమో. ఈయన ముఖంలో నవ్వు చూసిన రోజున వాళ్ళావిడ అందరికి స్వీట్స్ పంచి పండుగచేసుకుంటుందేమో.

తను డ్యూటీ చేయకుండా రోడ్లల్లో షికారుకొడుతున్నందుకు బ్రాంచి మేనేజర్ ముఖంపై కూడా చిన్నగా చీవాట్లు చిలకరిస్తాడు. డాన్స్ చేసి, ఆఫీస్‌ని నరకంలా చేస్తాడు.

అందుకే నాంపల్లి వెళ్ళి, ఒక టాక్సీ మాట్లాడుకున్నాడు. తనను తీసుకువెళ్ళి మహబూబ్‌నగర్‌లో దించాలి. డ్రైవర్ అడిగిన చార్జీకి ఒప్పుకున్నాడు. ఒక బిస్కట్ పాకెట్, స్వీట్ పాకెట్ కొన్నాడు.

టాక్సీలో ముందు తన రూంకు వెళ్ళాడు. దబదబా బ్రీఫ్‌కేస్ సర్దుకున్నాడు. కంపెనీ స్టాక్స్ తాలూకు బ్రోచర్స్, శాంపిల్స్, ఆర్డర్ బుక్స్ వగైరా సర్దుకున్నాడు. టాక్సీ ఎక్కి పోనివ్వమన్నాడు.

జూలాజికల్ పార్క్, అగ్రికల్చరల్ యూనివర్సిటీ దాటే వరకు అప్పుడప్పుడు వెనక్కి తిరిగి చూస్తూనే ఉన్నాడు— ఆ ఛండశాసనుడు తన వెనకాలే మరో టాక్సీలో వస్తున్నాడేమోనని! తను బుకాయించానని ఏమాత్రం అనుమానం కలిగినా డబ్బు కోసం కూడా ఆలోచించకుండా తన లాగే టాక్సీ ఎక్కి వచ్చేసే రకం.

షాద్‌నగర్ చేరాడు. అంత వరకు ఏ టాక్సీలోను, జీప్‌లోను తన వెనుక బినాయ్ రానందుకు సంతోషంగానే ఉంది.

ఒక మెడికల్ షాపుకు కాస్త దూరంలో టాక్సీ దిగి, షాపులోకి నడిచాడు...హలో బ్రదర్ అంటూ షాపు యజమానిని పలకరిస్తూ షేక్‌హాండ్ తీసుకున్నాడు. మరో చేత్తో వీపుపై తట్టాడు.

ఎండవేళప్పుడు కాబట్టి కష్టమర్స్ ఎవరూ లేరు. షాపు యజమాని కుర్రవాడు. రెండేళ్ళ క్రితమే పెళ్ళయింది. ఏమిటి! మా అల్లుడు కులాసాయేనా!'' అన్నాడు వాళ్ళ బ్బాయిని గురించి అతనునవ్వుతూ తల వూపాడు. తన బాగ్ నుంచి బిస్కట్ పాకెట్ తీసి'' ఇది మార్కెట్‌లోకి కొత్తగా వచ్చింది. ఫారిన్ కొలాబరేషన్‌తో, ఒక కంపెనీ యిది తయారుచేస్తోంది. మా అల్లుడి కోసం తెచ్చాను. ఇంటికి వెళ్ళేటప్పుడు తీసుకెళ్ళు'' అంటూ దాని అతని డ్రాయర్ సొరుగులో పడేసాడు.

అయిదు నిముషాలు ఏవోవే విషయాలు మాట్లాడాడు. ''ఇదిగో యా దగిరీ, మర్చిపోయాను. నిన్ననే నేను ఇక్కడికి రావాలి. ఓ చిన్న పని తగిలి రాలేకపోయాను. మా హెడాఫీస్ నుంచి జాన్ రావచ్చు. ఎవరేనా అడిగితే నిన్ననే మీ షాపుకు వచ్చినట్లు చెప్పాలి.''

''దానేముంది సాబ్. అలాగే.''

''ఏదైనా ఆర్డర్ యివ్వు.''

''మూడు రోజుల క్రితమే మీ డిస్ట్రిబ్యూటర్ నుంచి తెచ్చాను.''

''తెచ్చావులే. నా కోసం ఓ చిన్న ఆర్డరియ్'' అని, క్రిందటి తేదీతో ఒక ఆర్డర్ రాసుకున్నాడు. అతని వద్ద శలవు తీసుకుని, బాగా పరిచయం ఉన్న ఒక డాక్టర్ ఇంటికి వెళ్ళాడు. ఓ పాతిక మామిడి పళ్ళతో.

''ఎందుకయ్యా ఇవన్నీని..'' డాక్టర్ అడిగాడు

''వీటి గురించే నిన్న రావలసిన టూర్‌కి, ఈరోజు వచ్చాను. డాక్టర్. మా ఊరు వెళ్ళాను. ఇవి మా తోటలో పండినవి. మీ కోసం ప్రత్యేకంగా తెచ్చాను' అని ఓ అయిదు నిమిషాలు అవి, యివి మాట్లాడి, తన కంపెనీ సరకుల గురించి కూడా మాట్లాడి బయటపడ్డాడు.


అక్కడి నుంచి జడ్చర్ల చేరాడు. ముందుగా ఒక హేర్ కటింగ్ సెల్యూన్‌కి వెళ్ళి క్రాపు చేయించుకున్నాడు. షాంపూతో తల రుద్దించుకుని, డ్రయ్యర్‌తో ఆరబెట్టించుకున్నాడు. మీసాలు పూర్తిగా తీసేసాడు. అద్దంలో తన ముఖం చూసుకొన్నాడు. చాలా వరకు రూపం మారింది.

ఒక మెడికల్ షాపుకువెళ్ళాడు. ''ఆదాబర్సే నవాబ్‌సాబ్'' అంటూ షాపులోకి వెళ్ళాడు. షాపు యజమాని అరవై సంవత్సరాల ముసల్మాన్. ఇద్దరూ ఆలింగనం చేసుకున్నారు. ''క్యా సాబ్! హమారా బడా భాయీ కహా!'' ఎప్పుడూ షాపు చూసుకునే అతని పెద్ద కొడుకు గురించి అడిగాడు.

''అభీ అతాబేటా. తోడా కామ్ పర్ గయా!'' అంటూ కూర్చోమన్నట్టు కుర్చీ చూపించాడు. షాపు యజమాని 'వలీ' తన తండ్రి పోలికలో ఉంటాడని, అతన్ని చూస్తే తన తండ్రిని చూసినట్లు ఉంటుందని వచ్చేనప్పుడల్లా అంటూ ఉంటాడు ప్రకాష్. బాక్స్‌లోంచి స్వీట్ పాకెట్‌తీసి'' ఇది మా రంజాన్ కానుక'' అంటూ వలీకి అందించాడు.

''ఎందుకు బేటా అస్తమాను ఏదో వొకటి తెస్తావ్'' అంటూ దాన్ని అందుకున్నాడు వలీ.

''పితాజీ ఛోటా బాత్ హై'' అంటూ తను క్రిందటి రోజే రావలసిందనీ, కంపెనీవాళ్ళు ఎవరైనా వచ్చి అడిగితే నిన్ననే వచ్చినట్టుచెప్పమనిచెప్పి, క్రిందటి డేట్‌తో ఓ ఆర్డరు బుక్ చేసుకున్నాడు.



ముగ్గురి డాక్టర్స్‌ని చూసి, కంపెనీ బ్రోచర్స్, శాంపిల్స్ దండిగా వాళ్ళకిచ్చి, చీకటిపడే సమయానికి మహబూబ్‌నగర్ చేరాడు. వరుసగా కనిపించిన డాక్టర్స్‌ను కలుసుకుంటూ సెంటర్‌కి వచ్చాడు. ఒక హోటల్ ముందు ఆగాడు. ఒక రూమ్ తీసుకొన్నాడు. బోయ్ రూమ్‌లో అన్నీ సర్దగానే, టాక్సీ ఫేర్ చెల్లించాడు.

టాయ్‌లెట్ అయ్యాడు. బాగ్ తీసుకుని బయటకు వచ్చాడు. ముందు టిఫిన్ తిని, తరువాత వర్క్‌కు ఎటెండ్ అవాలనుకున్నాడు.

క్రింద రిసెప్షన్‌రూం చేరగానే కళ్ళు తిరిగినంత పనయింది. బినాయ్ అప్పుడే లోపలకు ప్రవేశిస్తున్నాడు. అతను ప్రకాష్‌ను చూసాడు. ఆయన్ని చూసి ప్రకాష్ చిన్నగా నవ్వాడు. "గుడ్ ఈవినింగ్ సార్" అంటూ విష్ చేస్తూ ముందుకు కదిలాడు. "నేను నమ్మలేక పోతున్నాను మీరేనా అని" అన్నాడు ఇంగ్లీషులో.

"ఎంతసేపయింది నువ్వొచ్చి" బినాయ్ అడిగాడు.

ఆయన ఏ ఉద్దేశ్యంతో అడిగింది ప్రకాష్‌కు అర్థమయింది. "ఏదీ ఇప్పుడేసార్ బయటకు కదులుతున్నాను. సింగిల్ రూమ్ ఖాళీ లేదంటే డబుల్‌రూం తీసుకున్నాను. మీరుకూడా నా రూములోనే వుండండి" అన్నాడు.

ఆ మాటలకు బినాయ్ నవ్వాడు. "అవును మధ్యాహ్నం ఆ జానీ ఆండ్ కో లో ఏమిటి కొంటున్నావ్ ?"

అమ్మో ! రాక్షసుడు ఎంత తెలివిగా అడుగుతున్నాడో అనుకుని ఏమీ అర్థంకానట్టు ముఖం పెట్టి "ఇక్కడ జానీ అండ్ కో ఎక్కడ సార్" ఆశ్చర్యపోతున్నట్టు అడిగాడు.

ప్రకాష్ ముఖ కవళికలు చూస్తుంటే తను ఎవర్నో చూసి పొరబడినట్లు అర్థంచేసుకున్నాడు అవును ఆ వ్యక్తి ఈ విధంగా లేడు అనుకున్నాడు.

"పదండి పైకి వెళదాం" అంటూ బినాయ్ బాగ్ అందుకోబోయాడు.

బినాయ్ వారించాడు. ఇప్పుడు నేను నీ బాస్‌ను కాదు. మూడు రోజులక్రితమే నేను కంపెనీ మారాను" అని తన కొత్త కంపెనీ పేరు చెప్పాడు. 'ఈ ఏరియాకు ఒక స్టాకిస్టును ఏర్పాటు

> పరిస్థితులకు భయపడి
> పారిపోయేవాడు-
> పిరికివాడు!
> పరిస్థితులతో రాజీ పడి
> సర్దుకుపోయేవాడు-
> బతకనేర్చినవాడు!
> పరిస్థితుల మీద తిరగబడి
> నవసృష్టికి నాంది పలికేవాడు-
> ప్రపంచానికి కావాలసిన వాడు!
>
> -ఆచార్య భావన్

చేయాలి. ఏదున్నరకల్లా ఈ హోటల్‌కు వచ్చి నన్ను కల్సుకోమని మా రిప్రజెంటేటివ్‌కు లెటర్ వ్రాసాను. నేను వేరే రూమ్ తీసుకుంటాను" అన్నాడు.

బినాయ్ మాటలు విని, అంత వరకు తాను పడిన కంగారు, శ్రమ నీరుకారి పోయినట్లు ఫీలయ్యాడు ప్రకాష్. *

---

# రజని

## నాకు సాహసమే



**1977** సంవత్సరంలో మా నాన్నగారి ఉద్యోగరీత్యా మేము పూరులో ఉండేవాళ్లం వేసవి శలవులు రావడం మూలాన మా చెల్లి మా నాన్నమ్మగారి ఊరు వెళ్ళింది. మా నాన్నగారు రెండు రోజుల క్రితమే క్యాంప్‌కెళ్ళారు. మా అమ్మ నేను మాత్రమే ఇంట్లో ఉన్నాం.

ఆ రోజు రాత్రి నిద్రలో నాకు ఏదో చప్పుడు వినిపించి మెలకువ వచ్చింది. టైమ్ చూస్తే రెండు పది అయ్యింది. ముందర గదిలో నుండి శబ్దం వస్తోంది. అది దొంగల పనేనని గ్రహించాను. ప్రక్కనున్న అమ్మని లేపాను. అమ్మ మేలుకుని శబ్దం విని ముందర గదిలోని కిటికీ ఊచలు వంచుతున్నట్టున్నారని మెల్లిగా చెప్పింది. ఇద్దరం భయంతో బిగుసుకుపోయాము. ఆ ప్రాంతంలో ఇళ్లు దూరం దూరంగా ఉండడంతో అరిచినా చుట్టుపక్కల వారికి వినిపిస్తుందన్న నమ్మకం లేదు. మా అరుపులు విని దొంగలు చటుక్కున లోనికొచ్చి మా ప్రాణాలకే ముప్పు తెస్తారని భయం. ఏది జరిగితే అదే జరుగుతుందని మెదలకుండా పడుకున్నాం. ఒక వైపు మా గుండెల చప్పుడు మాకే వినిపిస్తోంది. ఇంతలో దొంగలు లోపలికి దూకిన శబ్దం వినిపించింది. నాకు వెంటనే ఒక ఆలోచన వచ్చింది. లేచి మంచం క్రింది దూరాను. అప్పుడు ముగ్గురు దొంగలు మేమున్న గదిలో దూరి అమ్మని బీరువా తాళం కోసం బెదిరించారు. అమ్మ దస్కా తీసి వెంటనే తాళాలు ఇచ్చేసింది. ఒకరు అమ్మకి కాపలా ఉండగా ఇద్దరు బీరువా తీసి బీరువాలో ఉన్న వెయ్యి రూపాయలు, ఖరీదైన బట్టలు, బంగారం మూటగట్టుకున్నారు. గదులు చిన్నవి కావడంతో మంచాలకి దగ్గరలోనే పక్క గదికి తలుపుంది. అది నాన్నగారి రీడింగ్ రూమ్. నేను మెల్లిగా మంచం క్రింద నుండి పాక్కుంటూ ఆ గదిలో చేరాను. వాళ్ళు బీరువాలో దోచుకుంటుండగానే నేను పోలీస్ స్టేషన్‌కి డైల్ చేశాను. (అవసరమైన, ముఖ్యమైన ఫోన్ నెంబర్స్ మా నాన్న ఫోన్ దగ్గర ఒక చిన్న డైరీలో రాసుంచుతారు.)

నేను మెల్లిగా మా ఇంటి వివరాలు చెప్పి వెంటనే రమ్మన్నాను. దొంగలు వచ్చినదారినే హడావుడిగా వెళ్ళారు. వాళ్ళు వెళ్ళిన ఐదు నిమిషాలకి పోలీస్ జీప్ రావడం, వాళ్ళు వెళ్ళిన దారి మేం చూపించడం, మరో పది నిమిషాల్లో దొంగలు పట్టుబడడం జరిగిపోయింది.

నేనెందరి ప్రశంసలూ అందుకున్నాను. స్కూల్స్ తెరిచాక మా హెడ్‌మాస్టర్‌గారు ప్రత్యేకించి ఒక మీటింగ్ జరిపి నాకొక మంచి పెన్ ప్రెజెంట్ చేశారు. అప్పుడెలా ధైర్యం చేశానో గాని ఇప్పుడది తలచుకుంటే మాత్రం భయంగానే ఉంటుంది. టి.వి.లో రజని సంగతేమోకానీ ఆ వయస్సులో ఆమాత్రం ధైర్యం చెయ్యడం గొప్పగానే భావిస్తాను,

—వి. విశాల
లాంఫారం
(గుంటూరు జిల్లా)